క్లుప్తంగా

పింగళి వెంకయ్య జయంతి

నూజెండ్ల: మండలంలోని పెద్దవరం ప్రభుత్వ పాఠశాలలో భారత జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. విద్యార్థులకు జాతీయ జెండాపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రదానోపాధ్యాయులు ఘంటా శ్రీనివాసరావు పింగళి వెంకయ్య జీవిత విశేషాలు వివరించారు. ఆయన తెలుగు వారు కావటం మనమందరం గర్వించాలన్నారు. అనంతరం జాతీయ జెండా రంగుల ప్రత్యేకతను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తొలి విడత నగదు జమ

యడ్లపాడు: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ తొలి విడత నగదు విడుదల కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. యడ్లపాడు స్టేజీ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కలిపి సంవత్సరానికి రూ.20 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో మొదటి విడతగా రాష్ట్ర వాటా రూ.5 వేలు, కేంద్ర వాటా రూ.2 వేలు కలిపి రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు పేర్కొన్నారు. మిగతా రెండు విడతలు అక్టోబర్, జనవరిలో అందజేస్తామని తెలిపారు. నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు కె.వి.శ్రీనివాసరావు, ఎస్ఎస్ఎఫ్ఎం పథకం కింద 100 శాతం రాయితీతో కంది విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రెండోరోజు స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం



నాదెండ్ల: ఇర్లపాడు పీఎంశ్రీ కేంద్రియ విద్యాలయలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో తృతీయ సోపాన్ పరీక్షా శిబిరం శనివారం కొనసాగింది. రెండోరోజు పయనీర్ యాక్టివిటీ, ఎస్టిమేషన్ అండ్ మ్యాపింగ్, టెంట్ పికింగ్, క్యాంప్ క్రాఫ్ట్ తదితర విషయాలపై శిక్షణ నిచ్చారు. ప్రిన్సిపల్ నీరజ్ కుమార్ శ్రీవత్స మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యాలయం నుంచి కనపర్రు వరకూ ఐదు కిలోమీటర్ల నడక, సాయంత్రం 8 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణకు చెందిన 26 విద్యాలయాల స్కౌట్స్ అండ్ గైడ్స్ హాజరయ్యారు.

విద్యావలంటీర్ నియామకం

చిలకలూరిపేటటౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని ఉన్నత విద్యావంతులు, ఉన్నత స్థానాల్లో స్థిరపడిన యువకులు విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం స్వచ్ఛ సేవాటీంగా ఏర్పడ్డారు. వీరు పాఠశాలల అభివృద్ధి లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో చిలకలూరిపేట రూరల్ మండలంలోని కట్టుబడివారిపాలెంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం నెలవారీ వేతనం ఇచ్చేలా మహిళా విద్యా వలంటీర్‌ను నియామకం చేసినట్లు పాఠశాల హెచ్ఎం హనుమయ్య తెలిపారు.

8న కనపర్రు కౌలువేలం

నాదెండ్ల: మండలంలోని కనపర్రు గ్రామంలో కొలువైయున్న శ్రీ రాజ్య లింగేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన వ్యవసాయ భూములకు ఈ నెల 8వ తేదీన బహిరంగ కౌలువేలం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఈవో నిడమానూరి లక్ష్మయ్య తెలిపారు. సర్వే నెం.123లో 14.65 ఎకరములు, సర్వే నెం.139లో 1.27 ఎకరముల భూమికి వేలం జరుగుతుందన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

నరసరావుపేట టౌన్: ప్రభుత్వ వైద్యశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పల్నాడు జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగానికి అలవాటు పడిన యువతను సరైన మార్గంలో తేవటానికి ఇతర శాఖలతో పాటు వైద్య ఆరోగ్యశాఖ కూడా తన వంతు పాత్ర నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ వైద్యశాలలో 20 పడకలతో రెండు నెలల క్రితం డి-ఎడిక్షన్ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. పట్టణంలో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మరో డి-అడిక్షన్ సెంటర్ కూడా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ ఏడుకొండలు, బీసీహెచ్ఎస్ కార్యాలయ సీపీఓ మాల్యాద్రి, వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారు.

శ్మశానాలకు స్థలాలను కేటాయించాలి

శావల్యాపురం: శ్మశానాలు లేని గ్రామాలను గుర్తించి తక్షణమే స్థలాలను కేటాయించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గోదా జాన్ పాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కనమర్లపూడి గ్రామంలో మండల కమిటి సభ్యులు సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో పల్నాడు జిల్లావ్యాప్తంగా శ్మశానాలు లేని గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లోని పెద్దలతో మాట్లాడి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి శ్మశానాల స్థలాలు ఏర్పాటు చేయటానికి కసరత్తు చేస్తామన్నారు.

ప్రశ్నిస్తే కేసులు పెట్టడమే మీ లక్ష్యం

- కూటమి దాడులకు జనం భయపడాల్సిన అవసరం లేదు
- మాజీ ఎమ్మెల్యే, పీఏసీ సభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు
- ఈ పాలకులకు రైతుల గోడు పట్టదు
- బొల్లాపల్లిలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు

బొల్లాపల్లి: ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి వేధించడమే కూటమి ప్రభుత్వ పాలన తీరని మాజీ ఎమ్మెల్యే, పీఏసీ సభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. మండల కేంద్రమైన బొల్లాపల్లిలో శనివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పోస్టర్లను ఆవిష్కరించారు మోసాల గురించి ఈ పోస్టర్ ద్వారా తెలుసుకోవచ్చని తెలియజేశారు. పోస్టర్‌లో క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. ఈ కోడ్ ద్వారా చంద్రబాబు మోసాలు తెలుస్తాయని, ప్రతి గ్రామంలో పోస్టర్లు అంటించడం జరుగుతుందన్నారు.

దాడులకు పూనుకోవడమే లక్ష్యం!

బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ నాయకులపై దాడులకు పూనుకోవడమే లక్ష్యంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ ప్రభుత్వ పాలన ఉందని ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయటం, అధినేత జగనన్న పర్యటనలకు అడ్డంకులు సృష్టించడం మినహా రైతుల గోడు పట్టదని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఎరువులు, పురుగుమందులు అమ్ముకోవడం తన సొంత వ్యాపారాలకే పరిమితం అయ్యాడని, రైతుల బాగోగులు పట్టడం లేదన్నారు.

రైతు సంక్షేమం ఎక్కడా?

రైతుల అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి పట్టవన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారన్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మిరప, పొగాకు పంటలు సాగు చేయాలా వద్దా అని రైతులు సందిగ్ధంలో ఉన్నారని తెలిపారు. మిర్చి పొగాకు పంటలు ధరాగాతంతో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేశామన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందన్నారు. ఈ ప్రాంతంలో దశాబ్దాల వరికపూడిసెల కల నెరవేరే పరిస్థితి లేదని, అధికారంలోకి రాకముందు వరకపూడి నిర్మించి తీరుతామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం పాలన చేపట్టగానే మరిచిందన్నారు. వరికపూడిసెలను పక్కనపెట్టి బనకచర్ల నిర్మిస్తామని మరోసారి రైతులను మోసం చేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రాజెక్టుల నిర్మాణానికి వ్యతిరేకం కాదని, ఈ ప్రాంతానికి వరికపూడిసెల అవసరమని, కూటమి ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో మద్యం ఏరులైపోతుందని, రేషన్ మాఫియా విజృంభించి వ్యాపారం చేస్తుందన్నారు. ఇవేమీ ఈ ప్రభుత్వానికి పట్టవన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేష్ చాలా చేశాడు, ప్రజా రంజక పాలన అందిస్తున్నామని గొప్పలు చెప్పుకోవడమే కానీ ఇది ప్రజా కంటక పాలన అని విమర్శించారు.

అభివృద్ధి పథమన్నారుగా... ఎక్కడా?

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పారని, ఈ అభివృద్ధికి చంద్రబాబు, నారా లోకేష్ లు ఏమన్నా అడ్డుకట్ట వేశారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం పరిపాలనపై, రైతు సమస్యలపై దృష్టి సారించాలని ప్రజల భద్రతకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందని హితవు పలికారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీలో ప్రతి గ్రామంలో పోస్టర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆ పోస్టర్లో క్యూఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు మోసాలను ప్రజలకు ఇచ్చిన హామీలను తెలుసుకోవచ్చన్నారు. అదేవిధంగా వైఎస్సార్ సీపీ నాయకులపై అధికారులు అక్రమ కేసులు నమోదు చేసిన పాలక పక్షాలు దాడులకు పాల్పడిన వారి పేర్లను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. కూటమి ప్రభుత్వ దాడులకు భయపడాల్సిన అవసరం లేదని పార్టీ వర్గాలకు బొల్లా బ్రహ్మనాయుడు భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

జరీనా కథ సుఖాంతం



జరీనా వద్దకు వెళ్లి విచారిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఇన్యాసమ్మ, లేబర్ ఆఫీసర్ శివారెడ్డి



జరీనాను ఆటోలో ఆసుపత్రికి తరలిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

వినుకొండ: స్థానిక లేబర్ ఆఫీస్‌లో 9 నెలల నిండు గర్భిణీ జరినా అనే మహిళపై సాక్షిలో ప్రచురితమైన అంతులేని కథ – చెప్పలేని వ్యథ అనే కథనానికి జిల్లా కలెక్టర్ అరుణ్‌కుమార్ వెంటనే స్పందించారు. స్థానిక ఐసీడీఎస్, లేబర్ అధికారులను పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వినుకొండ నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ కందుల శ్రీరాములు అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇన్యాసమ్మ, లేబర్ ఆఫీసర్ శివారెడ్డిలతో పాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది జరీనాను పరిశీలించి ఆటోలో ఐసీడీఎస్ కార్యాలయం వద్దకు తరలించారు. అనంతరం వైద్యపరీక్షల కోసం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యపరీక్ష అనంతరం ఆమెను నరసరావుపేటలోని పునరావాస కేంద్రానికి పంపనున్నట్లు అధికారులు తెలిపారు. మెరుగైన వైద్యం అందించడంతో పాటు పునరావాసం కల్పించాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో తల్లిపాల వారోత్సవాలు

యడ్లపాడు: అమ్మపాలు అమృతంతో సమానమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శనివారం యడ్లపాడుకు విచ్చేసిన ఆయన గ్రామంలోని 9 అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తల్లిపాల ప్రయోజనాలు తెలిపే పోస్టర్‌ను ఆవిష్కరించి, గర్భిణులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.హేమలతా దేవి, ఈవోపీఆర్డీ షేక్ జాకీర్ హుస్సేన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.వెంకట రమణ, ఎం.అరుణ కుమారి, ఎం.కోకిలమారుతి, ఎస్.సరోజిని, కె. సుజాత, ఆర్.పరిమళ, కె.రాజ్యలక్ష్మి, ఎం మల్లేశ్వరీ, జనసేన నాయకులు రాజారమేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లింగారావుపాలెంలో...

యడ్లపాడు: తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని అంగన్‌వాడీ కార్యకర్త టి.పున్నమ్మ చెప్పారు. మండలంలోని లింగారావుపాలెం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సహాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకాగా పనిచేస్తాయని, పుట్టిన గంటలోపే తల్లిపాలు తాగించాలని సూచించారు. మొదటి ఆరునెలలు తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, ఇది మేధస్సు అభివృద్ధికి తోడ్పడటంతో పాటు తల్లికి రొమ్ము క్యాన్సర్ రాకుండా కాపాడుతుందని వివరించారు. ముఖ్యంగా తల్లిపాలు తల్లి–బిడ్డల అనుబంధాన్ని బలపరుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఏనుగుపాలెంలో...

వినుకొండ: మండలంలోని ఏనుగుపాలెంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించాలన్నారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని, తల్లులకు వివరించడం జరిగింది. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని తల్లులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దేవి, కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: మండలంలోని గరికపాడు, పమిడిపాడు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేశారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్ వైజర్ షేక్ మస్తాన్‌బీ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు త్రాగించాలని సూచించారు. ముర్రుపాలు బిడ్డ ఆరోగ్యానికి మొదటి టీకా వంటిదని తెలియజేశారు. శిశు ఆరోగ్యానికి తల్లిపాలు శ్రేయస్కరమని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు శంకరనారాయణ వైద్య సిబ్బంది అంగన్‌వాడి కార్యకర్తలు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ ప్రారంభం

వినుకొండ: అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం మొదటి విడత కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా మార్కెట్‌యార్డులో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబులు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలో 45,773మంది రైతులకు రూ.32.04కోట్లు జమ చేసినట్లు జరిగిందని అధికారులు తెలిపారు.

చక్కని చేతిరాతతో మెరుగైన ఫలితాలు

శావల్యాపురం: విద్యార్థుల్లో సమాన ప్రతిభ చూపటంతో పాటు మెరుగైన చేతిరాత ఉన్న వారందరు మంచి ఫలితాలు సాధిస్తారని ఎంఈవో పుసులూరి లలితకుమారి అన్నారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో చేతిరాత శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో లలితకుమారి మాట్లాడుతూ చేతిరాతలో ఇచ్చినటువంటి తర్ఫీదును సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా చేతిరాతను సాధన చేస్తూ మెరుగైన పలితాలు సాధించాలన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యార్థులకు నేర్పించి ప్రతి విద్యార్థి అందమైన చేతిరాత కల్గి ఉండేలా ప్రోత్సహించాలన్నారు. పదో తరగతి చదువుతున్న 75 మంది విద్యార్థులతో ఉపాధ్యాయులకు ఇంగ్లిష్‌లో హ్యాండ్ రైటింగ్‌లో ఉత్తమ శిక్షణ ఇవ్వటం అభినందనీయమన్నారు. శిక్షణ తరగతులు ఇచ్చినటువంటి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామ మోహన్‌రావు, కార్యక్రమ నిర్వహణకర్త బెజవాడ చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ సీనియర్ ఆంగ్ల ఉపాధ్యాయులు బెజవాడ వెంకట నాగేశ్వరరావు, టి.శ్రీనివాస రావు, చేపూరి రమేష్, సత్యనారాయణలనుసత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బొడ్డపాటి విజయలక్ష్మి, గురుబాబు, కోటేశ్వరరావు, ఆదాంఖాన్, పాల్గొన్నారు.

మోసం చేసిన చంద్రబాబును క్షమించరు

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- బుచ్చిబాపన్నపాలెంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

రొంపిచర్ల: రాష్ట్ర ప్రజలను నమ్మించి వచ్చి మోసం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును క్షమించరని మాజీ ఎమ్మెల్యే, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామానికి వచ్చిన గోపిరెడ్డిని పేద ప్రజలు ఎదురేగి సమస్యలు వివరించారు. తల్లికి వందనం కార్యక్రమం కింద తమకు డబ్బులు పడలేదని కొంతమంది ఆయన దృష్టికి తీసుకురాగా, మరికొందరు రూ.10,900లు మాత్రమే పడ్డాయని, రూ.3 వేలే పడ్డాయని చెప్పుకున్నారు. మరికొందరు గ్యాస్‌బండకు డబ్బులే పడట్లేదని వాపోయారు. పలురకాల సమస్యలతో గోపిరెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్ర బాబు ఏడాదిపాటు పథకాలను ఎగగొట్టడం ద్వారా పేద ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కరోనా సమయంలో కూడా ప్రతి పేదవానికి పథకాలను అందించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. 53లక్షల మంది రైతులకు జగనన్న రైతు భరోసా అందిస్తే 48 లక్షల మందికి కూడా బాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపచేయట్లేదన్నారు. ఈసందర్భంగా బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి మండల పార్టీ కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, జిల్లా రైతు విభాగ అధ్యక్షులు అన్నెంపున్నారెడ్డి, పంచాయతీరాజ్ విభాగ రాష్ట్ర కార్యదర్శి పడాల చక్రారెడ్డి, గెల్లి చినకోటిరెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షులు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్, నరసరావుపేట మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, మైనార్టీ విభాగం కరీం, యువజన విభాగ మండల అధ్యక్షులు మోతుకూరి వెంకటేష్, పానుగోటి వెంకటరావు, ఎంపీటీసీ తిరుపతయ్య, సర్పంచ్ కోటేశ్వరరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కోడూరి వెంకటేశ్వరరెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చలేక రెడ్‌బుక్ పాలన

వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట అధ్యక్షుడు షేక్ దరియావలి



క్యూఆర్ కోడ్ స్కాన్ చేయిస్తున్న షేక్ దరియావలి

చిలకలూరిపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక రెడ్‌బుక్ పాలనకు తెర తీశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి విమర్శించారు. పట్టణంలోని 08, 21 వార్డుల్లో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో సమావేశాలు నిర్వహించి, ఇంటింటికీ తిరుగుతూ క్యూఆర్ కోడ్ స్కాన్ ప్రజలతో చేయించారు. ఈ సందర్భంగా దరియావలి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది ప్రజావ్యతిరేక పాలనపట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోందని చెప్పారు. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదన్నారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిందేమి లేదని అయినప్పటికీ సుపరిపాలన పేరుతో ఇళ్లకు రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలుపరిచారని గుర్తు చేశారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి అమలు చేశారని వెల్లడించారు. ఇందుకు విరుద్ధంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను నట్టేటా ముంచిందన్నారు. కార్యక్రమంలో 8,21 వార్డు ఇన్‌చార్జ్‌లు తాళ్ల అంజిరెడ్డి, ఆలపాటి పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు కొండవీటి ఆంజనేయులు, కొప్పురావూరి పటేల్, ఆలపాటి రాహుల్, దస్తగిరి, అంకమ్మ రావు, తియ్యగూర అంజిరెడ్డి, ఏకాంబరపు సునీత, దాసరి అంజలి, గోపతోటి జాన్, కొచ్చెర్ల కిషోర్, బండారు జయకుమార్, సయ్యద్ జమీర్ పాల్గొన్నారు.

రైతాంగాన్ని మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

- మొదటి ఏడాది అన్నదాత సుఖీభవకు నిధులు ఇవ్వని ప్రభుత్వం
- ప్రకటనలో ప్రభుత్వ తీరును ఎండగట్టిన కౌలు రైతు సంఘ నాయకులు

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రతి రైతు కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఐదేళ్లలో రూ.1 లక్ష పెట్టుబడి సాయం అందిస్తామని హామీఇచ్చి అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయకుండా రైతాంగాన్ని మోసం చేసిందని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామినేని రామారావు, వై.రాధాకృష్ణ విమర్శించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు సంబంధం లేకుండా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించి, ఇప్పుడు ఆ నిధులు కలిపి ఇస్తామని చెబుతున్నారని, ఇలా ఇవ్వడం వలన రైతు కుటుంబానికి ఐదేళ్లలో రూ.56 వేలు మాత్రమే దక్కుతాయన్నారు. కూటమి నాయకుల వాగ్దానాల మాటలు కోటలు దాటుతాయని, అమలు చేయబోయే నాటికి చేతలలో చుస్తే గడపకూడా దాటడం లేదని ఎద్దేవా చేశారు. రైతు పక్షపాతి ప్రభుత్వమని చెబుతూనే రైతులను మోసం చేస్తున్నారని కూటమి మోసాలను రైతులు తెలుసుకోవాలన్నారు. ప్రతి కౌలురైతుకు అన్నదాత సఖీభవ పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చి రాష్ట్రంలో 72 లక్షల మంది కౌలు రైతులు ఉండగా వారిలో 47 లక్షల మందిని మాత్రమే ఎంపిక చేశారని తెలిపారు. వీరికి సంబంధించి ఇంత వరకు విధివిధానాలు ప్రకటించలేదని, కౌలు రైతులను గుర్తించి ఎంతమంది ఉంటే అంతమందికి షరతులు లేకుండా పథకం వర్తింపచేయాలన్నారు. భూమిలేని కౌలు రైతులను గుర్తించి కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేసి అన్నదాత సఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇవ్వాలని, ఈ క్రాప్ నందు పంటల నమోదు చేయాలన్నారు. దేవాలయ భూములు, ఇతర అన్ని రకాల భూములను సాగుచేస్తున్న రైతులకు పెట్టుబడి సహాయం అందించాలన్నారు.

వ్యవసాయంలో ప్రభుత్వ సహాయం కొద్ది మందికి ఇచ్చి కొద్ది మందికి ఇవ్వకుంటే అందని రైతులకు అన్యాయం చేసినట్లే అవుతుందన్నారు. ప్రభుత్వ సహాయం అర్హులైన వారందరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలలో రైతులకు అన్యాయం జరిగితే కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతులను ఏకంచేసి కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

వినుకొండ: పేదలకు అందాల్సిన 91 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రైస్‌మిల్లులలో శనివారం రాత్రి సివిల్ సప్లయిస్ అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. సాయిబాలాజీ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు డెప్యూటీ తహసీల్దార్ మురళి తెలిపారు.

నేడు శావల్యాపురంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం

శావల్యాపురం: బాబుష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నేడు మండల కేంద్రం శావల్యాపురంలో విఘ్నేశ్వర డెయిరీ ప్రాంగణంలో మండల స్థాయిలో వైస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం సాయంత్రం 3 గంటలకు జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు (కొండలు) శనివారం తెలిపారు. ఈసందర్భంగా కొండలు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొంటారన్నారు.

నేడు గుడ్ మార్నింగ్ టీ

నరసరావుపేట: పట్టణంలోని వినుకొండరోడ్డులో ఆదివారం ఉదయం ఏడుగంటలకు గుడ్‌మార్నింగ్ టీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉదయం 7గంటల కల్లా గుంటూరురోడ్డులోని పార్టీ కార్యాలయం వద్దకు తరలిరావాలని కోరారు.

4న ధ్వజ స్తంభ ప్రతిష్ట

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం బీసీ కాలనీలో (వడయరాజులు) వేంచేసియున్న శ్రీసీతారామలక్షణ హనుమత్ సమేత దేవాలయం ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం పూజ వేడుకలు శనివారం నుంచి ప్రారంభమయాయి. ప్రతిష్టా వేడుకలు ఈనెల 4న ఉదయం 8.07 నిమిషాలకు వేదపండితులు శ్రీమాన్ గుంటూరు శేషాచార్యులు, శ్రీదీవి శ్రీకాంత్ భట్టర్ తన బృందం సభ్యులచే వేడుకలు ఘనంగా నిర్వహించుతున్నట్లు సభ్యులు తెలిపారు.

నరసరావుపేట సబ్ జైలర్‌గా అంజయ్య

నరసరావుపేట టౌన్: నరసరావుపేట ప్రత్యేక శ్రేణి ఉపకారాగార పర్యవేక్షణ అధికారిగా సురభి అంజయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన నెల్లూరు ట్రైనింగ్ అకాడమిలో సేవలందించారు. ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా ఆయన నరసరావుపేట సబ్ జైలు పర్యవేక్షణ అధికారిగా బదిలీపై వచ్చారు.

ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్

వినుకొండ: పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు, ఉద్యోగులు, చేతివృత్తి పనివారు, గృహిణీలు ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుకోవడానికి వీలు కల్పించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు తెలిపారు. ఓపెన్ స్కూల్లో ద్వారా చదువుకున్న వారు రెగ్యులర్ టెన్త్, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్స్‌తో సమానమని తెలిపారు. ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాల న్నారు. వివరాలకు 9490006556ను సంప్రదించాలన్నారు.

స్మార్టు మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఏర్పాట్లను వ్యతిరేకిస్తూ ఈనెల ఐదవ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) (ఎంసీపీ ఐయూ) జిల్లా కార్యదర్శి రెడ్‌బాష కోరారు. స్మార్టు మీటర్లను వ్యతిరేకిస్తూ శనివారం నాల్గవ వార్డు పనసతోటలో కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం మీటర్లు బిగించడం ఉపసంహరించుకునేంత వరకు పోరాడాలని కోరారు. పట్టణ కార్యదర్శి మహబూబ్ బాషా, మండల కార్యదర్శి మస్తాన్‌వలి పాల్గొన్నారు.

నేడు కే–రిడ్జి పాఠశాలలో ఫ్లోర్ బాల్ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: గుంటూరు రోడ్డులోని కే–రిడ్జి పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 3వతేదీ ఆదివారం రాష్ట్రస్థాయి అండర్–14, అండర్–19 బాలబాలికల ఫ్లోర్ బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.కిషోర్‌బాబు శనివారం తెలిపారు. రాష్ట్రంలోని 16 జిల్లాల నుంచి దాదాపు 250 మంది క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొంటారని తెలిపారు. పోటీలలో భాగంగా రాష్ట్రజట్లు ఎంపిక చేస్తారన్నారు.